# పూర్ణిమ

పోడూరు రామంద్రరావు గారు. బి. ఏ.,

౧

సీతాపతి పదునెనిమిదివత్సరముల ప్రాయము వాఁడు. చామనచాయశరీరమువాఁడు. ఇంచుక పొడగరి. అతఁ డందగాఁడనియే చెప్పనొప్పను. చూచువారిహృదయములను చూరగొనునట్టి యాతని విశాలనేత్రములు సిరి కాటపట్టులని చెప్పనగును.

నాఁడు పూర్ణిమ. సాయంకాల మాఱున్నరగంట లయ్యెను. అప్పుడే శరచ్చంద్రుఁ డాకసము నలంకరించెను. సమీపమందలి గౌతమీసైకతములపైనుండి వీతెంచు చల్లని పిల్లగాలులు దేహములఁ బులకితములొనరించుచుండెను. బాలు లెల్లరు నిసుకతిన్నెలపై వివిధగతులఁ గ్రీడించుచుండిరి. ఒకచోట నీలాటిరేవున కనతిదూరమునఁ గట్టబడిన యొక చిన్నపడవపైఁ గూర్చుండి, సీతాపతి వచ్చుచుఁ బోవుచునుండు వారిని గాంచుచుండెను. ఇంతలో నొక పదిరెండువత్సరముల బాలిక యొర్తు భుజమున నొకబిందెను దాల్చి నీరు గొనిపోవుటకై వచ్చెను.



ఆమెయాకృతిఁ గాంచినంతనే సీతాపతియొడలు గగుర్పొడిచెను

ఆమె యాకృతిఁ గాంచినంతనే సీతాపతి యొడలుగగుర్పొడిచెను. ఆ బాలికమోము పూర్ణచంద్రుని హసియించుచుండెనా యను శంక వొడమెను. చక్కఁగఁదీరి యున్న సర్వావయవములుగల యా సుందరి నేర్పరి యగు శిల్పిచేఁ గల్పింపఁబడిన పుత్తడిబొమ్మ యను భ్రమ గొల్పుచుండెను. "ఆహా! ఇట్టి మృదు మృణాళగాత్రి, రాజాధిరాజుల

దివ్యమందిరముల నలంకరింపవలసిన యీబంగరుబొమ్మ యెవరితనయయోకదా? ఈమె నిట్లు దయఁదలంపక, జలంబుగొని తేరఁ బంచినవారి మనసెట్టులొప్పెనో కదా? గ్రంథములందువర్ణింపఁబడుపద్మినీజాతిస్త్రీలసౌందర్యప్రశంసఁజదివి పృథ్విపై నిట్టివనితలుగలరా యనుచు శంకించుచుండెడి నాకు, నేఁడట్టి సందేహనివృత్తి గావింపనెంచి విధి యీమె నిచటికిఁ బంపెనేమొ? ఇన్ని దినములనుండియు నేనిచటికి వచ్చుచుంటినిగాని మున్నెన్నఁడు నిట్టిముద్దుగుమ్మల నీపురమునఁ గాంచియుండ!" నని సీతాపతి యూహించుకొనుచుండెను.

సీతాపతి కళాశాలయందుఁ బట్టపరీక్షకుఁ జదువుచుండెను. అతఁడు శిష్టాచారపారీణులగు బ్రాహ్మణ దంపతుల కేకపుత్రుఁడు. వాని తలిదండ్రులు సామాన్యకుటుంబికులు. విశేష ధనవంతులుగాకుండినను గౌరవప్రపత్తిగలిగి, తోడికుటుంబములయందు మన్ననవడయుచుఁ గాలము గడపుచుండిరి. కుమారునకాంగ్ల విద్యఁ జెప్పించినయెడల నాతఁ డధమ మొక జిల్లాయధికారియైనఁ గాఁగలఁడను మూఢ విశ్వాసమునను, విశేషధనమార్జించి తమవంశమునకును జననీజనకులకును కీర్తిప్రతిష్ఠలు తేఁగలఁడను వెఱ్ఱియాసలతోను సీతాపతి జనకుఁ డాతని కాంగ్లవిద్యఁ జెప్పించుచుండెను. సీతాపతియు జాగరూకతతో విద్యగఱచుచు, తరగతియందు మొదటివాఁడుగఁ గాకుండినను నెన్నఁదగినవారిలో నొకఁడుగ నిలచుచుఁ, గ్రమముగఁ బట్టపరీక్షాతరగతిలోనికి వచ్చెను.

అతఁడవివాహితుఁడు; తలిదండ్రులు వైవాహిక ప్రశంసఁ దెచ్చినపుడు, విద్యాపరిపూర్తియైనఁగాని పెండ్లి జేసికొనననని చెప్పితప్పించుకొనుచుండును. సీతాపతికి నేఁటివఱకును బరిణయవాంఛ లేకుండెను. వివిధగ్రంథములయందుఁ జదివియుండిన వింతవలపునుగూర్చి యాలోచించినకొలఁది వానికి హైందవనారీమణులను జేపట్టినవారి కట్టినిక్కమగు ప్రణయసుఖము లబ్బుట కష్టసాధ్యమను నిశ్చయమగు తలంపు కలిగెను. ఆంగ్లదేశాచారానుసారము ప్రాయమువచ్చినయువతియువకు లొండొరులనుగాంచి ప్రేమపాశానుబద్ధులై యిరువురును ఒకరియభిమత మొకరెఱిఁగి నిక్కమగు ప్రేమగలిగియుండుట గుర్తెఱిఁగి, పెండిలిఁ గావించుకొనిననేకాని, సతీపతులకుచితమగువలపు కుదురదని వానితలంపు. హిందువులయాచారముల ననుసరించి బాల్యముననే పరిణయమగుటయు, జ్ఞానాభివృద్ధియైనపిదపఁ దనకుఁ బెద్దలు చేకూర్చినపడఁతిని బ్రేమించుట యావశ్యకర్తవ్యమని గుర్తెఱిఁగి, తదనుగుణ్యముగ భార్యయే పరమసుందరియని భావించి, యనురాగమునంతయు నామెపైఁ బ్రవహింపఁజేసి, జీవితము నానందదాయకముగ నొనరించుకొనుట యసంభవమనియు నాతఁ డెన్నుచుండెను. ఎన్నఁటికైన వివాహమాడుట యావశ్యకమైనచో, స్వయముగా నొకకన్నె నారసి, యామె గుణగణముల గమనించి, యామెను జేపట్టవలెనని వానియూహ. ఇట్టియాలోచనలతోఁ గాలముగడుపుచు, సీతాపతి యింతవఱకును దలిదండ్రులకోరికల సరకుగొనక, తనయూహాల

నెన్నఁటికైనఁ గార్యరూపమునఁ బెట్టుటొండె, యవివాహితుఁడై నిరంతరబ్రహ్మచర్యవ్రతమును సల్పుటొండె, యొనరింపవలెనని ధృఢనిశ్చయుఁడై యుండెను. అతఁడింతవఱకు నెందఱిఁగాంచినను, ఏరికైనను విషయలాలసత్వసంబంధములగునాలోచన లాతనికి స్ఫురింపలేదు. నేఁడేలొకో వాని కీబాలికామణినిగాంచినంతనే హృదయము మారాటపడసాగెను. శకుంతలను పొడగాంచిన దుష్యంతనృపాలునికిఁగదిసీతాపతియుఁ దనజీవితయాత్రయం దీమె కేదియో సంబంధముండఁగలదని తలంచెను. ఏవిధముగ నీయపరిచితయగు బాలిక తన జీవితపరిణామమునం దొక పాత్రధారి కాఁగలదని యూహింపఁజొచ్చెను. ఈమెకును దనకు నెట్టిసంబంధమునులేని యవస్థయం దీయపరిచితవ్యక్తిసందర్శనమాత్రమునఁ దన కట్టియుత్తలపాటు గలుగనేలయని యాతఁ డూహింపసాగెను.

ఇంతలో నాబాలిక బిందెతో జలమును స్వీకరించి, గృహాభిముఖియయ్యెను. ఆమె పోవుచున్నపుడు సీతాపతి చూపానినంతవఱకు నామెగమనము నుపలక్షించుచుఁ, దన యాసనమున నిశ్చేష్టుఁడై కూర్చుండి, యామె దృష్టిపథమును బాసినంతనే తనస్వాప్నావస్థనుండి మేల్కాంచి, యాబాలికారూపమునే మనఃఫలకమునందుఁ జిత్రించుకొని స్వగృహము చేరెను.

౨

ఒక్కొక్కప్పుడు మానవుని జీవితమున నల్పవిషయములే వింతమార్పులు గలిగించుచుండును. సరసులో నొక చిన్నరాయి రువ్వినచో దానివలన జగత్తంతయుఁ గలతఁ జెందునని యొకానొక తత్త్వవేత్త నుడివియున్నాఁడు. అట్టులే యణుమాత్ర విషయములును మనుష్యజీవితముల నధికములగు మార్పు లొనరించుచుండును.

విద్యాభ్యాసముతక్క యితరచింతలు లేని సీతాపతిహృదయమందు రూపవతియగు నొకయపరిచితబాలికాసందర్శనము విశేషపరిణామమున కాస్పదమయ్యెను. విద్యార్థివసతిగృహముఁ జేరిన సీతాపతి వివిధచింతావాగురలఁజిక్కి యాందోళనముఁ జెందుచుండెను. నాఁడతని కాహారమైన హితవుగాకుండెను. అతఁడు తిన్నఁగాఁ దనగదిఁజేరి దీపారాధనను గూడ మఱచి శయ్యపైఁ బరుండి యిట్లు యోజింపసాగెను.

ఈమెయెవ్వతె? ఎవరి తనయ? ఈమె విషయమునుగూర్చి తెలిసికొనుటెట్లు? కనుఁగొంటినిపో, ఈమెకును నాకును గలుగఁబోవు సంబంధమేమి? ఈమె యవివాహితయో, వివాహితయో? ద్విజకులజయో, కాదో? ఎట్టివారితనయయో? ఈమెను నాకిత్తురను టెట్లు? అదియుఁగాక నాతలిదండ్రులు సమ్మతింతురా? తలిదండ్రులమాట త్రోసిపుత్తమనుకొన్నను బిల్లనిచ్చువారి యభిమతమెట్లుండునో? ఆమె స్వతంత్రురాలు కాదు గదా? పరులపోషణపై నాధారపడియున్న బాలిక యేమిచేయఁగలదు? నేనైన నట్టియవస్థలోనున్నవాఁడనే కదా? ఇరువురును వివేకవంతులై,దృఢబద్ధానురాగులైయున్నచో

లోకమునకైన శంకింపఁ బనిలేదు. కాని యీమొక్కట్టివివేచనాశక్తి, నాపై మోహాపారవశ్యము, మనోద్రఢిమయుఁ గలుగనేర్చునా? బాలిక, మోహమన్నది యెఱుఁగనేరనిది; హైందవాచారానుసారముగఁ బెరుగుచున్నది; వైవాహికోచిత వయస్సు ప్రాప్తించినది; యింకను అవివాహితగ నుండనేర్చునా? అదియుఁగాక, నావంటివానికై యొకయబల బంధుగులను, స్వసంఘమును ద్రోసిపుచ్చ వలసి దురాలగునటు కేమి యవకాశమున్నది? నేను రాజాధిరాజునా? ప్రతిమన్మథుఁడనా? నాకేమి యాధిక్యము కలదు? నాకన్నను కామయాసర్థరెన్నమట్లు గాన్పించినను, నా వలపు, నాపట్టుదల, నామనఃస్థైర్యము నా విశ్వాసము, నావివేకశక్తి, నాయపూర్వమగు ఊహాసరణియు నామె కెట్లు బోధింపఁ గలను? ఇన్నిసత్ఫలములు విద్యాభ్యాసమునఁ గలిగినవిగదా? నాకింతమాత్రపు టూహ లేర్పడినవి? బాలిక, విద్యావిహీనయో, అల్పవిద్యావతియో యైయున్న యామెకెట్టి నవీనాభిప్రాయము లుదయించుటయు, బోధపడుటయు నెట్లు? ఏమి నాకీవెఱ్ఱియూహలు? ఆకాశమున దివ్యహర్మ్యములు నిర్మించుకొని యానందించుచుంటినే కాని, యిట్టియూహ లీషణ్మాత్రావకాశములేదని తెలిసికొనైతినిగదా? ప్రపంచమున నీలాటిరేవుల కొందఱు స్త్రీపురుషులు వచ్చుచుఁబోవుచునుందురు? వారి నొకవ్యక్తిమూచి వృథావ్యథకు లోనగుట వానియవివేకమునే సూచించును గాని, వారాతనిని జూచునట్లు చేయునని యెట్లు తలంప వచ్చును? విషయలాలసుఁడు, పరులఁగాంచి భ్రమించుచుండువాఁడు, పరులెల్లరు తన్నుఁ జూచుచుందురనియు, నందఱును దన్నుఁ జూచుటయే తనకువలెనే ముఖ్యకర్తవ్యముగఁ గలవారనియుఁ దలంచునేకాని, వారితలంపుల కేమాత్రమును దానాస్పదుఁడు కాకపోవచ్చునని తలంచునా? చక్కఁగ శిరోజముల నలంకరించుకొని, వలెవాటుగఁ బట్టుదుప్పటముఁ దాల్చి, మాటిమాటికి నూనూగుమీసముల దువ్వుకొనుచు వీథులవెంబడిఁ దిఱుగు వివేకహీనులు, విలాసపురుషులు, వెడఁగులు, పరభామలు తమ సుందరాకృతిగాంచి, విరహవేదనచే నొక్కుచుందురని తలంచి లోలోనఁ దాము కులుకుచుందురేకాని, లెక్కలేని, పనికిమాలిన వ్యర్థడాంబికులను, ఆడంబరజీవులను, అహంభావస్వాములను, అప్రయోజకులను గాంచి మూర్ఖులనంతటి మూర్ఖులెవరుందురని తలంతురా? వ్యక్తికి వేయివిధములు. అందదియు నొకటి. ఇట్టివ్యర్థప్రాలోచనలతోఁ గాలము వ్యర్థపుచ్చుటకంటె, వేరుపని చేసికొనుటయే కర్జము. ఆబాలిక నన్నేటికిఁ జూచును? చూచినను నన్నామె యేటికి సరకుగొనును? ఇదియంతయు మతిభ్రమణము; చిత్తచాంచల్యము. నేనిట్లుయుంటినేని తోడివిద్యార్థులు నన్నుఁగాంచి, నాయందు మూర్ఖ్యగమనించి, నన్ను గేలిసేయుదురు. మదనార్తి యెట్టిదైనను, పదనైన చెలికాండ్ర పదజాలముల దాటికోర్చుట దుర్భరము. నేనిట్టి తలంపులను వీడి, తిన్ననిమార్గమున సంచరింపనైతినేని లోకాపవాదమునకు గురియగుదును. అంత

కన్న వేఱులాభ ముండఁజాలదు. కాని యీ బాలికావిగ్రహమును నా మనఃప్రదేశము నుండి తొలఁగించుకొనఁజాలుదునా! అదియే గొప్పచిక్కు. రొంపిలో కాలు పెట్టవచ్చును. కాని యూడఁదీసికొనుటయే కష్టసాధ్యము.

ఇట్లు చింతించుచు శయ్యపైఁ బొర్లాడి, నిద్రరాకుండుటచే నొకానొక ఆంగ్లనవలఁ గొని చదువనారంభించి, యందుఁ గృతకృత్యుఁడు గానేరక, గోదావరీతీరమున కేఁగి, యందు గొంతతడవు గడిపి, తెలతెలవారు సమయమున నచటనే యిసుకయందుఁ బడి సీతాపతి నిద్రావివశుఁడయ్యెను.

## 3

సూర్యోదయమయ్యెను. ఇసుకతిన్నెపైఁ బవ్వళించిన సీతాపతికనులలోఁ బడి సూర్యకిరణము లాతనిని మేల్కొల్పెను. వెంటనే యాతఁడు లేచి వసతిగృహాభిముఖుఁడై నడచి పోయెను.

సీతాపతి యెంత ప్రయత్నించినను వానికిఁ బూర్ణిమనాఁడు కనుపడిన యాబాలికయాకృతి మఱపు రాకయుండెను. క్రమక్రమముగ వానికి విద్యయందిచ్ఛయు దూరమయ్యెను. అతఁ డెల్లపుడు నేదియో యొకటి యాలోచించుకొనుచునే యుండెను. పాఠశాలయందును బైటకూడ వానికిఁ బరధ్యానమే. ఇట్లు కొంతకాలము గడచునప్పటికి వానికిఁ బరీక్షలు సమీపించెను. అతఁడు పరీక్ష కిసుమంతయైన కృషిసలుపకయే పరీక్షకుఁ బోనెంచెను.

తగినకృషి సలుపక పరీక్ష కేగుట కడుం గడు సాహసము. పోయి కూర్చుండినపిదపఁ జేయునదిలేనిపట్లు దురూహాలు జనించుచుండును. పనిలేనివానికి దురూహాలు మెండు. సీతాపతికి సమీపమున వేంకటరావను నొకయువకుఁడు కలఁడు. అతఁడు పుస్తకములు చూచి వ్రాయుటలో నిపుణుఁడు. ఎంతటివారికైనను తెలుపక కాళ్లసందు పుస్తకములనుంచి యుత్తరములు వ్రాయుచు, దగ్గరకు వచ్చిన వారినెల్లరను దనకుఁ బ్రతిబంధకముగ నున్నదని మందలించుచు నిరాఘాటముగ నాతఁడు పరీక్షాపత్రములను ముగించుచుండును. వీనిని గాంచిన సీతాపతికిఁ దా నిదివఱకెన్నఁడు నట్టిపని సేయకున్నను నాఁడు ప్రయత్నింపవలెనను దురూహ జనించెను. ఆమధ్యాహ్నమాతఁడు కొన్ని కాగితములు చొక్కాయి క్రింద నిడుకొనిపోయి, యెట్లో వానిని గాగితములలోఁ జేర్చి వ్రాయఁజొచ్చెను. వాని యప్పటిమానసికావస్థ వర్ణనాతీతము. చేతకానివానికిఁ జెడుపనులు చేయునప్పుడు గలుగు నాందోళనయుఁ, గష్టము ననంతములు. నేర మొనరించువాని కెల్లరును దన్నె గమనించుచుండిరనియే తోఁచుచుండును. ఇట్టియవస్థలో నెట్లో చూచి యొకకాగితము వ్రాయుట ముగించునప్పటికిఁ బరీక్షాధికారులలో నొకఁ డచటి కేతెంచెను. వానినిఁ గాంచినంతనే సీతాపతిముఖము వైవర్ణ్యమునొందెను. దేహము కంపించెను. ముచ్చెమటలు పోసెను. వాని లేఖినియు గాలితాకుడునవోలె గంపించెను. వానిపైఖరిఁ గాంచిన యుపాధ్యాయున కాత

ని పై అనుమాన ముదయించెను. అతఁడు సీతాపతిదగ్గరఁజేరి వానికాగితములను బరీక్షింపఁబోయెను. సీతాపతి మోమునకత్తివాటువైచినను రక్తపుచుక్క లేకుండెను. అతని ధైర్యము పూర్తిగా సడలిపోయెను. పలువురిలోఁ దనకుఁగలుగఁబోవుచున్న యవమానమును దలంచినంతనే వానితల తిరుగుచున్నట్లయ్యెను. ఇఁక నచ్చట నిలచిన కార్యము లేదని తలంచి, చేయిమీఱినవెనుకఁ జేయునది లేదని యెంచి, పరీక్షకాగితము లచటనేవిడచి యాతఁడు వెడలిపోయెను. దయార్ద్రహృదయుఁడగు నాయధికారి వానివెంటనేఁగి తానాతని కేయపకారమును జేయనని తెల్పినను వినక సీతాపతి వేవేగ నడచి యింటికేఁగెను.

* * * *

నేఁడు విద్యార్థివసతిగృహమంతయు నల్లకల్లోలముగ నుండెను. సీతాపతి మిత్రులాతఁ డెచటికేఁగినదియుఁ దెలియరాకున్నదనియు, నాతనిగది మూయఁబడియున్నదనియు నాతఁడు తనగదికి మఱలివచ్చిన చిన్నెలెవ్వియుఁ గానరావనియుఁ బాఠశాలాధికారి కెఱింగించిరి. పాఠశాలాధికారియు నాతఁడు స్వగ్రామమున కేగియుండనోపు నని యూహించి మిన్నకుండెను. కాని వాని కనుంగుమిత్రుఁడగు దీక్షితులను నొకసహపాఠి వాని యుదంతమును తెలిసికొనుటకు నిశ్చయించి వానితలిదండ్రులకుఁ గుమారునిజాడ లెఱుంగఁ జేయవలసినదని తంతివార్త నిచ్చెను. నాఁటి సాయంకాలమే సీతాపతి స్వగ్రామమునకు వచ్చియుండలేదని ప్రత్యుత్తరము వచ్చెను.

అవమానితుఁడైనవాఁ డదృశ్యుఁడయ్యెనో, ఆత్మహత్యగావించుకొనెనో యని భయపడి దీక్షితులు రక్షకభటులకు సీతాపతి నన్వేషింపవలసినదని తెలిపెను. రక్షకభటులు నొకవారము దినములు శక్తివంచనలేకుండఁ గృషిసల్పి, కృతకృత్యులు కాలేకపోయిరి.

పిట్టచివర కాయూరివారెల్ల రాతఁడు విదేశములకుఁ బలాయితుఁడయ్యెనో, యెందైన దాఁగియుండెనో, యనుచు వివిధవిధములఁ దర్కించుకొని వానిసంగతి యొకించుకయుఁ దెలియకుండుటచే నా ప్రశంస విస్మరించిరి. ఇది మానవులకు సహజము. ఎంతటిమహాపురుషుఁడు మరణించినను, స్వల్పకాలములో వానిని మఱచిపోవుదురు. లేనిచో నీజగన్నాటకమొకింతయు సాగనేరదు. మఱపనుమాటయే వానికిఁ గలుగకున్న భూతకాలమునంతయు విస్మరించిననేకాని మానవుఁడు దైనికవ్యాపారములయందుఁ బాల్గొనఁజాలఁడు. స్మశానవైరాగ్యము, పురాణవైరాగ్యము, ప్రసూతివైరాగ్యము తాత్కాలికము లేకాని చిరకాలము నిలువఁజాలవు. అది లేనినాఁడు ప్రపంచ మంతరింపవలసినదే.

* * * *

సుతునియదృశ్యవార్త వినిన సీతాపతి జనని బెంగచే మంచముపట్టెను. వృద్ధాప్యమందేకపుత్రవియోగదుఃఖము దుర్భరము దుస్తరము నగుఁగదా! సీతాపతి జనకుఁడు మాత్రము పురుషుఁడగుటచే భార్య నూరార్చుచుఁ దన దుఃఖమును బయలుపఱుపక కాలము గడుపుచుండెను.

## ౪

ఈమధ్య నీపురమున జనులెల్లరు నిచటికి విచ్చేసియున్న బాలభారతీస్వామివారినిగూర్చి పలువిధములుగఁ జెప్పుకొనుచుండిరి. ఆయన బాలస్వామియనియుఁ దత్త్వార్థరహస్యకోవిదుఁ డనియు, విజ్ఞానియనియు, కందమూలాదులే కాని తక్కినవారివలె మాధుకరములు, క్షీరాన్నము మొదలగు గొప్ప యాహారములను స్వీకరింపఁడనియు, నాయన మహత్త్వమునుగూర్చి వేనోళ్లఁ బొగడుచుండిరి.

నాఁడు భారతీస్వామివారు కరుణను గూర్చి యుపన్యసించుచుండిరి. ఆయన యుపన్యసించునప్పుడు వినువారి హృదయములు ద్రవీభూతము లగుచుండెను. కర్కశహృదయములు గలవారుకూడఁ గనుల నీరిడిరి. అచటికేతెంచిన ప్రేక్షకులలో నత్యంతోత్సాహముతో వినుచుండిన యొక పదునాఱువత్సరముల బాలిక, స్వామిదృష్టి నాకర్షించెను. ఆ యువతి యెల్లరును సభనువిడచిపోవునంతదాఁక నచటనే కూర్చుండి, పిదప మెల్ల మెల్లఁగా స్వామినిజేరి సాష్టాంగ దండప్రణామములు గావించి, వినయముగఁ జేతులను జోడించి నిలచి తనజీవితము దుర్భరమనియు, దుఃఖకరమనియుఁ, దానొక వితంతువనియుఁ, దలిదండ్రులు తన్ననాదరభావముతోఁ జూచి పలుబాములఁ బెట్టుచుండిరనియుఁ, దనకు దుఃఖోపశమన మొనరించునదియు, బాధావిముక్తి గావించునదియు, మోక్షసాధకము నగు తరణోపాయము నెఱింగింప వలసినదని స్వామిని ప్రార్థించెను. దీనమగు నామెచరిత్ర వినినంతనే స్వామి హృదయము కరిగి పోయెను. ఆయనకుఁ బూర్వస్మృతిగలిగి కనులనుండి యశ్రులు స్రవించెను. ఆయన యెట్టకేలకు ధృతిని దాల్చి తనయాందోళనముఁ గనుపడనీయక, యాబాలవితంతువు నవలోకించి యిట్లుపన్యసించెను.



“ అది ద్వైతభక్తి ... అదియే సర్వార్థసాధనము. ”

“సోదరీ ! నీదశనుగూర్చి వినినప్పటి నుండియు నాకుఁ జాల విచారము గలుగుచున్నది. నీవు నన్నుఁ దరణోపాయము నెఱింగింపుమని కోరితివి. వెఱ్ఱిదానవు. సన్న్యాసాశ్రమమును స్వీకరించినవారలేగాని తరణోపాయము నెఱింగింపరాదను భ్రమకు లోనగు

చున్నదానవు. ఒకరు బోధింప నేల? హైందవ మతమునం బుట్టి పెరిగిన సమస్తజీవులకును వెలిసియున్నదే యాధ్యాత్మికరహస్యము. అది దైవభక్తి. దానికిఁ బ్రాముఖ్యమగు అంగము పాపకార్యవిముఖత. వేదాంతులమని విఱ్ఱవీగు జ్ఞానులను అహంకారవస్వాములెల్ల మను సుకరముగు దానిని వ్యర్థపదజాలములచే దుష్కరము నొనరించుచున్నారు గాని, యందుగల విశేషమేమి? హింసావృలరక్తము స్రవించు ప్రతిప్రాణికి నీవిషయము తెలిసి యున్నదే. వ్యర్థతర్కములతోఁ గాలము వెచ్చపెట్టుటకేకాని, ఆడంబరయుతములగు పదజాలములయొక్క ప్రయోజన మిసుమంతయు లేదు. భక్తితో హరినామస్మరణయు సర్వ్వానికిఁ బరమార్థము కరతలామలకము. మనసునకుఁ బాపమని తెలిసినపనిని మానుకొనుటయే మరియొక ముఖ్యవిషయము. ఈ రెండు పనులను చేయ నేర్పుటకన్న మోక్షసాధనము వేఱొండు లేదు. ఇదియే యిహపరసాధనమునకు మూలసూత్రము. తక్కినవానికై వ్యర్థముగాఁ గష్టపడక వీని నాచరించు జీవియే ధన్యజీవి. నేను నాల్గువత్సరములు గురువునొద్ద శుశ్రూషయొనర్చి తెలిసికొనినసంగతి యిదియే." అని ముగించుటయు నావితంతువు ప్రమోదబాష్పము లొలుక "స్వామీ! పాపసంకిలమగు నీజీవితమునందు నాకిష్టము లేదు. నాకుఁ దమరు సన్న్యాసాశ్రమమును బ్రసాదింపుఁ" డని ప్రార్థించెను. అంత భారతీస్వామి "అమ్మా! నీవింకను జిఱుతవయసుదానవు. నీకుఁ గష్టనిష్ఠురములు తెలియవు. ఈయాశ్రమము సుకరమని తలంచుచుంటివి గాంబోలు. అది పట్టికల్ల. అన్నియాశ్రమములకును గష్టము లుండును. అన్నిటికన్న సుకరము గృహస్థాశ్రమమే. కావున నీతలిదండ్రుల గృహమునందుండియే యీశ్వరు నారాధించుచుండుము. తగినభక్తి యలవడినంతనే మనస్స్థైర్యమును, దాన నద్భుతమగు మానసికశక్తియు నంకురించును. దానిచేఁ గష్టములన్నియుఁ దొలఁగిపోవును. ఇంతియేకాని సన్న్యాసిని యగుటకుఁ బ్రాకులాడకుము. కాషాయాంబరధారణము, గురునాజ్ఞయు నాశ్రమస్వీకారమున కంగములని తలంపకుము. అది పట్టిమిథ్య. మనసన్నె సర్వాశ్రమముల నొసంగఁగలదు. నేనిచ్చుటేల? నీవే పుచ్చుకొనవచ్చును. ఒకరిచ్చినఁ బుచ్చుకొనుట దేనికి? అనేకులు వీథుల వెంబడిఁ గాషాయాంబరములుదాల్చి స్వాములమని చెప్పుకొనుచుఁ దిరుగుచుండినవారి నెందఱిని జూడలేదు. వారెల్లరును నిక్కమగు స్వాములని యేనీయభిప్రాయమా? కాషాయాంబరములు కాపురుషుని ఘనునొనర్పఁజాలునా? వారు కుహనాసన్న్యాసులగుటచే నెల్లరు నట్టివారనినాయభిప్రాయము కాదు. కానిచాలమంది కపటనటకులు. కుక్షినింపుకొనుటకు భిక్షలు లభించుననియు, నెల్లరును నమస్కరించి పూజింతురనియుఁ దలంచి వారట్టి యాశ్రమమును స్వీకరింతురేకాని వాంఛాసమూహములఁ బారఁద్రోలి సర్వసంగపరిత్యాగ మొనరించుకొనినవారు కారు. కొందఱు సన్న్యాసులకుఁ జెన్నపురినస్యము, కొందఱికి సబ్బుబిళ్లలు, కొందఱికి భోజనమైనంతనే తమలపాకులును

గావలసివచ్చుచున్నవి. నిజముగ నైహికసుఖములను రోసినవారి కీవ్యసనము లేల? ఇట్టి వ్యసనములుగలవానికి సన్న్యాసాశ్రమమేల? కొందఱు ధనార్జనముకూడ నొనరించుచున్నారు. వీరెల్లరును దమకు జీవనోపాధిగ సన్యాసాశ్రమముం జొచ్చిరేకాని దైవభక్తిచేతం గాదు. ప్రాపంచికవిముఖతచేం గాదు. కావున నిట్టివానికై పరితపింపక నీవు స్వగృహమున నిల్చి బీదసాదలకు నుపచరించుచు భూమిపైం బుట్టినందులకు సాధ్యమయినంతయుం గార్యము నొనరించుచు, నిరంతర హరినామస్మరణచేం గాలము గడపుకొనుము. అదియే సర్వార్థసాధనము" అని బోధించుటయు స్వామివారికి మరల నావితంతువు ధన్యవాదములును నమోవాకంబులు నర్పించి యింటి కేగెను.

౫

మఱునటి దినమునఁ బురమందిరమున బాలభారతీస్వామి 'సమత్వమును' గూర్చి యుపన్యసించుచుండెను. అచటి కేతెంచినవారిలో నిరువురు వృద్ధదంపతులు వేదికసమీపముననిలచి స్వామిని గాంచి యశ్రులు రాల్చుచు బదింబదిగనమ్మహానుభావుని వదనమునుగాంచి యుస్సురనుచుం దమలో దావేదియో ముచ్చటించుకొనుచుండిరి.

ఉపన్యాసము ముగిసిన వెంటనే స్వామివారు మరునాం డాపురమును విడిచి పోవుచుండిరి గావున నేరి కేసందియములున్నను వారిని మఠామునం గలసికొని సందియముల నివారించుకొనవచ్చునని హిందూసమాజ కార్యదర్శిగారు తెలిపిరి.

ఆరాత్రి యావృద్ధదంపతులిరువురును స్వామి దగ్గరి కేంగి "స్వామీ! మిమ్ములంజూచినప్పటినుండియు మాకుం బూర్వస్మృతియు, బుత్రవాత్సల్యమును గలుగుచున్నవి. తమరి నావిషయముంగూర్చి ప్రశ్నింపందలంచియునను వుగాదనియు, మనుజులను బోలినమనుజులుండంగూడదాయనియు నెంచియూరకుంటిమి. తమకు మాతృపితృభావ మంకురించుటకుం గారణ మేదియో తెలిపి మాసందియము నివారింప 'వేడెద'మనుటయు, స్వామి విషాదానతవదనుండై "పూర్వాశ్రమసంస్మృతిమాబోంట్లకసంగతము. కాని మీరిట్లుకోరుటచేం జెప్పుచున్నాను. నేను సంగపరిత్యాగమున



"హా పుత్రా! సీతాపతీ! మమ్మునిట్లు దిక్కుమాలినవారిగ నొనరించితివా!"

మీయెడఁగల ప్రేమపాశమును త్రెంచుకొనఁ జాలితిని గాని, వాస్తవముగ మీరు నాజననీ జనకులు. వందనీయులు." అని చెప్పబోవు చుండగనే "హాపుత్రా! సీతాపతీ! మమ్మునిట్లు దిక్కుమాలినవారినిగ నొనరించితివా?" యని యావృద్ధులు వాపోవఁదొడంగిరి. స్వామియుఁ జేలాంచలమున నశ్రులఁదుడిచికొని "తలిదండ్రులారా! ఏటికిట్లువాపోయెదరు? ఋణానుబంధము చెల్లినంతనే జీవులకుఁగల సంబంధమును విరమించును. మీపుత్రుఁడు లోకము దలంచినట్లు మరణింపలేదు. ఆనాఁటి సీతాపతియే నేఁడిట్లు సన్న్యాసియై యిచటికివచ్చినాఁడు. కానియిఁక ముందు మనసంబంధము త్రెళ్లిపోయినది. ఇదియే కడసారి మాపుగఁదలంచి సంతోషింపుఁ" డనుటయు నాముదుసలులు "హా! నాయనా! మాకింక నీముదిమినెవరినిదిక్కుగఁజూపితి"వని గోలుగోలున నేడ్చుటయు, స్వామి "అమ్మా! ఇట్లు భీరువులగుటచేఁ గార్యమేమి? కడచిన దానికి వగవనేల? మరల మీపుత్రుని స్మరింపకుఁడు. మీకులేఁడనియే తలంచుఁడు. ఆపరమాత్మయే దిక్కుగాఁగలఁడు. ఇఁక మీరిట్లు విలపించుచుండినచో నేనును విచారింపవలసి వచ్చును. అది నాయాశ్రమమునకుఁ దగనిపని కావున నిఁక సత్ప్రస్తావన విరమింతము. ఇది యెల్లరకును దుఃఖభాజనమే. ధైర్యమే యిందుకుఁ బ్రతీకారము. కావున నిఁక పొండు"డని వారినిల్లకు సాగనంపి, వెంటనే స్వామియు, నాపురమునయుండనొల్లక, దండకమండలువులను గైకొని యథేచ్ఛం జనియె.

* * * *

వృద్ధులును బోయినసుతుఁడు మనియుండెనను సంతసమును, తమకుఁ గాఁడయ్యెఁగదాయను విషాదమును బెనఁగొన నింటికేఁగి, యిఁక నీపురమున నుండనేలయని "కాశ్యాంతు మరణాన్ముక్తిః" యను నార్యోక్తి ననుసరించి, కాశికాపురికేఁగి, యచట విశ్వేశ్వర సన్నిధాన వర్తులై కాలము గడపిరి.

* * * *

పూర్ణిమయాదినమున సీతాపతి కగపడి యాతనిజీవితమునకు మార్పుగలిగించిన యా బాలవితంతువును 'పూర్ణిమ'యేయని వ్యవహరింతము. పూర్ణిమస్వామిబోధనలచేఁ బ్రఫుల్లహృదయయై భక్తురాండ్రలో నగ్రస్థానమలంకరించెను. ఆమె చేయు మంచిపనులు వర్ణనాతీతములు. నగలంతయుఁ దమయింటఁగల పనులన్నియు నిర్వర్తించి, యనాథలకును, బీదలకును జేతనగుసాయముచేయుచు, మనోదర్పణమున శ్రీరామవిగ్రహమును బాదుకొల్పి, విరామములేక రామమంత్రోచ్చారణ మొనరించుచుఁ బెక్కేండ్లు కాలముగడపెను. తుదకొకనాఁడామె శయ్యపైఁబరుండి శ్రీరాముని ధ్యానించుచు, నసువులఁబాసి, శ్రీరాము సాన్నిధ్యమున కేఁగెను.